అల్లరి చిల్లరి వీధి దెబ్బలాటల దగ్గర్నించీ, కత్తిపోట్ల వరకూ అనేక రకాల అనుభవాలున్నాయి రంగడి జీవితంలో. జైలునించి వచ్చి యింకా ఎన్నోరోజు లవలేదు.

అంతకు ముందు చాలా రకాల చిల్లరి నేరాల్ని చేయించింది జీవితం వాడిచేత. కానీ యిప్పుడు వాడు చేయాలనుకుంటున్న పనివేరు. దానికి వాడు వేస్తున్న పథకం వేరు. వొంటి మీద చిన్న దెబ్బేనా వెయ్యకుండా వో పెద్ద శాల్తీని లొంగదీయాలనుకుంటున్నాడు.

రంగడి బతుకులో పెద్దగా అబద్ధాలు లేవు ...రంకు ల్లేవు.

కాని జైళ్ళున్నాయి.... అల్లర్లున్నాయి ... మొరటుతనం వుంది. వాళ్ళమ్ముకునే ఆడాళ్ళ వొంటి అనుభవాలున్నాయి. బాహాటంగా తింటాడు.. తిరుగుతాడు ...అన్నింటికన్నా ముఖ్యంగా చాలామంది తాపత్రయపడే శీలం గొడవ లేదు వాడికి.

సూటిగా చూస్తె వాడి జీవితం చాలా సింపుల్. డబ్బున్న వో ఆసామికి తొత్తు వాడు. ఆయన చెప్పిన పన్లు, రిస్కు వున్న పన్లు చేస్తాడు.... అవకాశాన్ని బట్టి, ఆయన యివ్వటాన్నిబట్టి డబ్బు తీసుకుంటాడు. డబ్బున్నంత సేపు ఖుషీ చేస్తాడు.

రంగడు కూలీనాలీ చెయ్యడు. డబ్బు కూడబెట్టడు. అలా అని పస్తులూ వుండడు. చాలా చిత్రమైన జంగిల్‌లా వాడి లైఫ్ తన అవసరాలు చూసుకోటం. తింటూ, తిరుగుతూ గడిపేయటం.

యిలా గాలివాటుగా గడిపే రంగడికి యిల్లు, నా అన్నవాళ్ళూ లేకపోలేదు.

తండ్రున్నాడు.... వీళ్ళతో వుండక పోయినా వో అక్కుంది.... వీళ్ళతోనే వుంటున్న వో చెల్లెలుంది.

రంగడి తండ్రి వెంకన్న జీవితంలో చాలాకాలం వో రైస్ మిల్లు వాచ్‌మెన్‌గా గడిపాడు. అతని వుద్యోగానికి పర్మనెంట్.

# అడివి బలం

## వి. రాజారామ మోహనరావు



పెన్షన్‌లాంటివి లేకపోటంవల్ల ముసలితనం వచ్చేటప్పటికి ఏం మిగల్లేదు. పెళ్ళాం మిగల్లేదు. వుత్సాహం మిగల్లేదు. మిగిలిందల్లా కుళ్ళు కాలవలమధ్యలోని పాకబతుకు. యీ ముగ్గురు పిల్లలు....

పసితనంలో పిల్లలు ఎండకి.గాలికి.వానకి ఎక్స్‌పోజ్ అయినా పరవాలేదు. కానీ అల్లరి చిల్లరి బతుక్కి... చాలా మంది వీళ్ళ దగ్గరకి నెట్టేసిన మురిక్కి... వీళ్ళకి ఎంత మాత్రం కూడని సరదాలకి, ఆశలకి.. సరైన జీవితం నుంచి వేరుచేసే ఫోర్స్‌కి ఎక్స్‌పోజ్ కాకూడదు. వెంకన్న పిల్లలు ఎండా గాలీ, వానతోపాటు వీటన్నింటి వాతా వడ్డారు.

రంగడి జీవితం యిలా వుంటే.. రంగడి అక్క జీవితం మరోలా వుంది. పేరుకి ఎవరో ఒకతనితో వున్నా చెదురుమదురుగా

తిరుగుతోంటుంది. "మనబోటి బతుక్కి పాతివ్రత్యం ఎలా కుదుర్తుంది.. పట్టు పసుపుల బతుకెలా కుదర్తో....యిదీ అంతే" అన్న ధోరణిలో బతుకుతోంది.... అదే ధోరణిలో మాట్లాడుతుంది. పాతివ్రత్యం కాస్ట్లీ ఎఫైర్ అన్నదృష్టి ఆమెకి. యింక వీళ్ళిద్దరి కన్నా చిన్నది సీత...దానికి చుట్టూ అన్నీ కనపడుతున్నాయి.... సరదాలు.... షోకులు.... కానీ అవి ఎలా అందుతాయో మాత్రం తెలియటంలేదు.... యింకా పసితనం.... భయం.... తండ్రిమీద ప్రేమ దాన్ని వదల్లేదు.

అవకాశం దొరికినప్పుడల్లా వెంకన్న రంగడితో అంటూనే వున్నాడు. "ఇంటికి మొగబిడ్డలా వున్నావు.... ఎందుకూ? అక్కవూసూ అక్కర్లేదు.... చెల్లెలి గొడవా అక్కర్లేదు పెద్దదాని బతుకు ఎలాగా గాలి బతుకై పోయింది....ఏం చెయ్యటానికీ నేను వోపిక లేనోణ్ణి .... నువ్వే ఆ చిన్నదాని బతుక్కి ఏదోటి చెయ్యాలా...." అని.

అప్పటి కప్పుడు వెంటనే సీతకి చెయ్య గలిగిందేమీ రంగడికి కనపళ్ళేదు...."అవసరం రానీ....అప్పుడు చేయచ్చు...."అన్న ధోరణిలో కాలం గడుపుతున్నాడు.

ఇప్పుడా అవసరం తోసుకొచ్చింది.

ఈ మధ్యే .... పసిగా భయంగా, తండ్రంటే ప్రేమగా వుండే కన్నెసీత.... ఆడసీతగా మార్పబడింది. ఆ సంగతి వెంకన్నకి తెలిసింది.

రంగడు జైలు నుంచి వచ్చాక వెంకన్న జరిగిందంతా వాడికి చెప్పాడు. చెప్పి ఏడ్చాడు. సీత పసితనం. ముసలి తండ్రి కన్నీళ్ళు.... రంగడికి చాలా ఆవేశం వొచ్చింది. ఆ ఆవేశంలో తొందరపడి ఏదో ఒకటి చేసేసేవాడే.... కానీ వాడి ప్రత్యర్థులు యిద్దరవటం వల్ల ముందు

## మధురిమ

నవ రాగాలకు నాంది
నా జీవనంలోనే వుంది



సరస సంగీత మధురిమ
నా మదిలోనే దాగుంది.

—పెద్దాడ విజయలక్ష్మి

ఎవరూ.... అన్న ఆలోచనొచ్చింది. ఆ ఆలోచనే రంగడి ధోరణిని మార్చింది.

సీతకి అన్యాయం చేసింది ప్రకాశం.... సీతకి జరిగిన అన్యాయం గురించి అడిగితే వెంకన్నని అవమానించింది ప్రకాశం తండ్రి రామభద్రం....

ఎవరికి ముందు బుద్ధి చెప్పాలి అన్న రంగడి ఆలోచనకి వాళ్ళిద్దర్లో యెవరివల్ల యెక్కువ అన్యాయం జరిగిందన్న పాయింట్ పునాది....జరిగిందంతా.... తండ్రి చెప్పిందంతా తిరిగి పునశ్చరణ చేసుకున్నాడు రంగడు.

* * *

ఆ కొట్లో పెద్దగా పనేం వుండదు ప్రకాశానికి....కొట్లో అనేకాదు నిత్యజీవితంలో కూడా పెద్దగా పనేం లేదు అతనికి. అతని తండ్రి రామభద్రం ప్రకాశం జీవితాన్ని అలా డిజైన్ చేసి పెట్టాడు.

సారా వ్యాపారం, బియ్యం వ్యాపారం, యిలాంటి అయిదారురకాల వ్యాపారాలే కాకుండా ఆ వూళ్ళో రెండు సినిమా హాళ్ళున్నాయి రామభద్రానికి.... వీటికి తోడు కమీషన్ వ్యాపారం. కొడుక్కి కొంచెం వ్యాపకంలా వుండాలని ఆ కమీషన్ కొట్లో కూచోపెట్టాడు. ఆ కొట్టుకి వెనక సందులోనే గోడౌన్ వుంది.

నిజానికి వ్యాపారం అంతా చూసేది రామభద్రమే....ప్రకాశం పనల్లా ఆ కొట్లో వుండి తండ్రి చెప్పినట్టు చెయ్యటమే.

ఆ కొట్టుకి రెండు గదులున్నాయి.... ముందుగదిలో టేబిల్, అయిదారు కుర్చీలు, ఓ ఫోన్.... అదే కొట్టు వ్యాపారం గది.... యింక వెనకగదిలో నవారుమంచం, పరుపు. అది ప్రకాశం విశ్రాంతి గది.


ప్రకాశంవుంటే ఆ సమయానికి మనసు వుంటే కొట్టుపని చూస్తాడు లేకపోతే ఆ పనులు చూట్టానికి గుమాస్తా వున్నాడు.

రంగడు యెక్కువగా బతుకుతున్నది రామభద్రంగారి అండనే. ఆయనకి ఆయన వ్యాపారాలకీ తొత్తుగానే వాడు జీవితం గడుపుతున్నది. అందుకే అయ్యగారి కొడుగ్గా. చిన్నయ్యగారిగా ప్రకాశం కూడా రంగడికి పరిచయమే.

చిన్న చిన్న పనులు రంగడికి ప్రకాశం కూడా పురమాయిస్తుంటాడు. అలాగే ఆ పనీ అప్పచెప్పాడు. రోజూ కొట్టు పొద్దున్నే బాగుచేసి, తుడిచి మంచినీళ్ళు పెట్టే పని మనిషి అవసరం. పాత పనిమనిషి ముసల్ది చచ్చిపోటంవల్ల ఆ అవసరం వచ్చింది.

పెద్దపని కాదు.... నెలకి యిరవై రూపాయల జీతం.... ఏదోరకం గొప్పకి సీతకి వుపయోగంగా వుంటుందిలే అని చెల్లెల్ని ఆ పనిలో పెట్టాడు.... అయిదారు నెలలుగా పనిచేస్తోంది సీత.... ఆ డబ్బుతో అప్పుడప్పుడు వో సినిమా అని.... కొత్త జాకెట్టని సరదాగానే గడుపుతోంది సీత.

ఆదివారం కమీషన్ కొట్టు తెరవరు. కానీ ఆ ఆదివారం యిద్దరు స్నేహితుల్తో కలిసి చిన్న పార్టీ పెట్టుకోటంవల్ల కొట్టు తెరిచాడు ప్రకాశం. గ్లాసులు కడగటానికి, మంచి నీళ్ళు అందించటానికి, సిగరెట్లు, తినుబండారాలు తేవటానికి పనికొస్తుందని ఆ ఆదివారం పొద్దున్న సీతని కూడా రమ్మన్నాడు ప్రకాశం. అలా వచ్చినందుకు జీతానికి సంబంధంలేని వో రెండు రూపాయలు గిడతాయి.దాంతో సినిమా ఆశ సీతకి. ఈ అయిదారు నెలల్లో అంతకుముందు కూడా కొన్ని ఆదివారాలు యిలాంటి పనిమీద రావటం సీతకి అలవాటే.



ఉదయం పదింటికి మొదలైన పార్టీ

పన్నెండింటి వరకూ మంచి పుషారుగా నడిచింది. వ్యాపారం కబుర్లు, సినిమా కబుర్లు, సరదా కబుర్లు, ఆడాళ్ళ కబుర్లు అన్నిరకాల కబుర్లని మందులోనంచుకున్నారు ప్రకాశం, అతని మిత్రులు.... చివరకి అన్ని కబుర్లలోనూ కలిసి బూతులపాలు కొంచెం యెక్కువైంది.

తాగ్గలిగినంత తాగి, తినగలిగినంత తిని పన్నెండున్నరకి ప్రకాశం మిత్రులు వెళ్ళిపోయారు.

వొంటరిగా మిగిలిన ప్రకాశానికి మత్తుగా అనిపించింది. అంతకు ముందు రాత్రి నిద్దర లేకపోటంవల్ల వొళ్ళంతా నొప్పులుగా బరువుగా అనిపించింది.

విశ్రాంతి గది చేరాడు ప్రకాశం.. వెళ్ళిపోటానికి సిద్ధంగా నిలబడింది సీత.

"కాళ్ళు లాగుతున్నాయి.... కాస్సేపు కాళ్ళు పిసకవే" అన్నాడు ప్రకాశం.

"లేదండీ.... ఇప్పటికే బాగా ఆలిశ్యం అయిపోయింది.... ఇంక పోతానండి...." అంది.

"ఎంతే ఒక్క అయిదు నిముషాలు పిసుకు చాలు.... అయిదు రూపాయిలిస్తా పట్టుకుపో...." అన్నాడు ప్రకాశం.

అయిదు నిముషాలేగా అనుకుంది సీత.... "అయిదు రూపాయలు...."అనీ అనుకుంది.

సీత దృఢమైన చేతులు కాళ్ళు పిసుకుతుంటే హాయిగా వుంది ప్రకాశానికి. పిసికినంతవరకూ కాళ్ళనొప్పులు తగ్గినా.మిగిలిన వొళ్ళంతా మరింత బరువెక్కింది. ఆ బరువు దింపుకునే మార్గమేమిటో ప్రకాశానికి తెలుసు. సీతవేపు చూశాడు.

సీత అందగత్తె కాదు.పెద్ద అలంకారాలు తెలిసిందీ కాదు. ఎటొచ్చీ సీతలో వున్నదీ ఆ క్షణాన ప్రకాశానికి కనిపించింది ఏపుగా పెరిగిన వొళ్ళు.


ప్రకాశం బుర్రలో ఆ ఆలోచనపుట్టింది. 'ఎలా?' అనుకున్నాడు. రంగడి విషయం పూర్తిగా మరిచిపోలేదు ప్రకాశం.

సీతమీద పుట్టిన ఆ ఆలోచన అసూహ్యంగా పెద్దగా పెరిగిపోయి ప్రకాశాన్ని తినేసింది. 'తను బలవంతం చేసినట్టు వుండకూడదు. సీత వొప్పుకున్నట్టు వుండాలి..' అనుకున్నాడు ప్రకాశం. అంతే యింక అతను ఆలిశ్యం చెయ్యలేదు.

"ఏమే మంచి హుషారుగా వుంది..నాతో పడుకుంటావేంటే," అన్నాడు చిన్నగా నవ్వుతూ.

కింద కూచుని కాళ్ళు పిసుకుతున్న సీత. "ఛీ...." అంటూ ఒక్కసారిగా లేచి నిలబడింది.

"నిన్నేం బలవంతం పెట్టేయన్లే..కూచో కూచోని నేచెప్పేది విను...." అన్నాడు.




అంటమేకాక సీత తిరిగి కూచునేవరకూ వొదల్లేదు. కూచున్నాక—

వ్యాపారం లెఖ్ఖల్లో సీత బతుకుని సీతకి విడమర్చి చెప్పాడు ప్రకాశం...."మీనాన్న సంగతి నీకు తెలుసు.... ఇంక రంగడు పుట్టి జులాయి వెధవ.... మీ అప్ప నీడకి చేరావంటే నిన్నూ బజారు మనిషిని చేసేస్తుంది.... వీళ్ళల్లో ఎవరు చేసినా, ఏ ముసలోడితోటో, కుంటాడితోటో, లేకపోతే మరే రౌడీ వెధవతోటో చేస్తారు నీ పెళ్ళి.... ఆ వచ్చిన మొగుడు ఎన్నాళ్ళు చూస్తాడో నీకు ఎవడూ చెప్పలేడు.... అందుకని సుఖంగా బతికే పద్ధతి చెపుతా విను.... నెల నెలా నీకుమూడొందలిస్తా నాతో వుండిపో" అన్నాడు.

మూడొందలే కాదు. మంచి మంచి చీరల ఆశపెట్టాడు....సీతకి అందుబాట్లో లేని ఖరీదైన తిండి ఆశపెట్టాడు. సినిమా లన్నాడు.

## బెయిల్

బహు భార్యాత్వం, అక్రమ
సంబంధం నేరాలపై
అమావాశ్యనాడు అరెస్టవుతాడు
చంద్రుడు



ఆ మరునాడే విడిపిస్తుంది
అతివిన్ని తోడబుట్టిన లక్ష్మి.

—డి. మురళీకృష్ణ

వొప్పుకుంటే అదే గదిలో స్వర్గం నీ బతుక్కి అన్నాడు.

అంతే కాక... "ఏదో వుషారులో వుండి కానీ లేకపోతే నీకీ అదృష్టం దక్కేదేంటి.. నాకు నీ మీద యీ ఆలోచనొచ్చేదా.... తొందరగా తేల్చేసుకో.... అయిదు నిముషాలే నీకు టైము.... ఇలాంటి ఛాన్సు మళ్ళీ నీ జీవితానికి రాదు...." అన్నాడు.

సీతకి వెర్రెత్తిపోయింది.... ప్రకాశం చెప్పేది నిజమే అనిపించింది. ఎవణ్ణి కట్టుకున్నా ఏముంది? మళ్ళీ ఆ పాకల్లోనేగా బతుకు.... ప్రకాశం చెప్పినట్టు ఒప్పుకుంటే నెలకి మూడొందలు.... సినిమాల్లో తను చూసే సరదాలన్నీ తీరతాయి .... 'సరే.... సరే....' అనేసుకుంది సీత.... అయిదు నిముషాలు ఎక్కడ అయిపోతాయో అనే పేరికం కంగారులో నాలుగో నిముషాన్నే వొప్పేసుకుంది.

సీత వొప్పేసుకున్నాక ప్రకాశం తన సరదా తీర్చేసుకున్నాడు. వెళ్ళేముందు సీతకి వో వంద యిచ్చి మిగిలిన రెండొందలు ఫస్టుకి జీతంతో తీసుకోమన్నాడు.

శారీరకంగా కొంచెం జుంఝగానే వున్నా, ఏదో గొప్పపని సాధించినట్టే అనిపించింది వెర్రి సీతకి. పైగా యింటికెళ్ళి ధైర్యంగా ప్రవర్తించాలనుకుంది. అలా అనుకునే యింటికొచ్చి వెంకన్నతో తను నెలకి మూడొందల సంపాదనకి ఎలా కుదురుకుందో గొప్పగా, ధైర్యంగా చెప్పింది. ప్రకాశం యిచ్చిన వందా చూపించింది. తమలో యెవరూ సాధించలేని నెలకి మూడొందల సంపాదన సాధించానన్న గొప్ప సీతకి.

అంతావిని నెత్తిబాదుకున్నాడు వెంకన్న. సీత బతుకు పూర్తిగా అన్యాయమై పోయిందనిపించింది వెంకన్నకి. ప్రకాశం మాటల్లో

ఎంత నిజం వుందో అతని అనుభవానికి తెలుసు. రంగడు జైల్లో వున్నాడు. ఏం చెయ్యటానికి దిక్కుతోచక వెంకన్న రామభద్రం దగ్గరికి పరిగెత్తాడు. జరిగిందంతా చెప్పి ఏడ్చాడు. పిల్లబతుకు అన్యాయం కాకుండా చూడమన్నాడు.

విషయమేమిటో తెలుసుకుంటానని, మర్నాడు రమ్మనమనీ వెంకన్నని పంపించేశాడు రామభద్రం. ఆ మర్నాటిలోపు అంతా తెలుసుకోటమే కాక ఏంచెయ్యాలో కూడా నిర్ణయించుకున్నాడు. మర్నాడు వెంకన్న వెళ్ళినప్పుడు—

"చూడు వెంకన్నా— నా కొడుకనీ, నీ కూతురనీ కాదు. న్యాయం న్యాయంగా మాట్లాడాలి. నువ్వు చెప్పినట్లు నిన్న మావాడు,యింకో యిద్దరు కుర్రాళ్ళు కొల్లో పార్టీ చేసుకున్న మాట నిజమే. కానీ మధ్యలో ప్రకాశం ఏదో పనిమీద బైటికెళ్ళాడు.... వాడు తిరిగివచ్చేటప్పటికి యిదంతా జరిగింది. అంతే తప్ప మీ సీత చెప్పినట్టు ఏం జరగలేదు. ఎలా లొంగిందో మీ సీత ఆ వందకి ఆ కుర్రాళ్ళిద్దరికీ లొంగింది. ఆ వంద వాళ్ళే యిచ్చారు.... కావాలంటే వాళ్ళని వొచ్చి చెప్పమన్నా చెప్తారు...." అన్నాడు రామభద్రం.

వెంకన్న అయోమయంగా చూశాడు.... సీత అమాయకత్వం వెంకన్నకి తెలియంది కాదు. ప్రకాశం ఎంతటి తిరుగుబోతో కూడా తెలుసు. రామభద్రం మాటలు ఎంత అబద్ధమో తెలుసు.

సీతని ప్రకాశానికిచ్చి రామభద్రం పెళ్ళిచేసేస్తాడన్న ఆశతో రాలేదు వెంకన్న. జరిగిందానికి కొంచెం సానుభూతి చూపించి వెయ్యో, రెండువేలో సాయంచేస్తే సీతకి వెంటనే మరో మనువు చెయ్యొచ్చని ఆశించాడు. కానీ రామభద్రం మొత్తమంతా తల్లకిందులుగా మాట్లాడుతున్నాడు.

ప్రకృతి

కడలి గుండె చీల్చుకొని
కల్పిస్తుంది నదికి స్థానం
తల్లి కడుపు మాడ్చుకుని
యిస్తుంది బిడ్డకు స్తన్యం



మేఘం కండ్లు చీల్చుకొని
కారుస్తుంది వర్షం.
నా కలం నవ్వుతూ చికిలిస్తుంది
నవకవితా క్షీరం.

దిగులుగా నిల్చున్న వెంకన్నని చూస్తుంటే మరో పథకం తట్టింది రామభద్రానికి. తప్పు, తమ మీద వుందని ఏ మాత్రం వొప్పుకోకూడదని ముందే నిర్ణయించుకున్నాడు. దానికి ఇది మరోబలం....

"వెంకన్నా....రంగడు, నువ్వూ తెలిసున్నవాళ్ళు కాబట్టి వొదిలేస్తున్నాను. అదే యింకోళ్ళయితే నా కొడుకుమీద తప్పుడు వాగుడువాగినందుకు చెప్పుచ్చుక్కొట్టేవాణ్ణి. పెద్దవాడివి .... ఏదేనా డబ్బవసరం వుంటే అడగాలికానీ....యిలా లేనిపోనివి కల్పించటం ఏం బాలేదు" అన్నాడు. అని, దానికి తోడు,

"అయినా నువ్వే ఆలోచించు, నిజం నీకే తెలుస్తుంది....నీ కూతురు సీత ఎంత అందగత్తో నీకూ తెలుసు. అలాంటిదాని మీద మా ప్రకాశం ఆశపడాల్సిన అవసరం, వుంచుకుంటా ననాల్సిన అగత్యం ఏమిటి? వాడు తలుచుకోవాలేగానీ దీన్ని మించిన వాళ్ళు నిమిషాలమీద దొరుకుతాపు. అందుకని యీ మాట యింకెవరి దగ్గరా అనకు... వెళ్ళు.... వెళ్ళు.... యిలాంటి పిచ్చి వేషాలు మానేయి." అన్నాడు.

సీతకి జరిగిన అన్యాయానికే ఏడ్చిన వెంకన్న.... ఆ క్షణాన తన దౌర్భాగ్య పరిస్థితి చూసుకుని మరీ ఏడిచాడు. తన ఏడుపంతా రంగడు జైలునించి వచ్చాక చెప్పుకోటం తప్ప ముసలి వెంకన్న యింకేం చెయ్యలేకపోయాడు.

* * *

జరిగిందంతా పోగేసుకుని ఆలోచిస్తే తనేం చెయ్యాలో, తన పరిస్థితికి తనేం చెయ్యగలడో స్పష్టంగా అర్థమైందిరంగడికి. దానితోపాటు వాడికి ఇంకా కొన్ని సంగతులూ అర్థమయ్యాయి.

రామభద్రానికి తను తొత్తు.... ఆయనకి నమ్మిన బంటు.... ఆయన చెప్పినపనల్లా చేసినందుకు ఆయన డబ్బిచ్చినా, యిచ్చిన డబ్బుకన్నా ఎక్కువలాభం ఆయనకివుంది. ఆ లాభం తానాశించలేదు. కానీ ఆయన దగ్గర పడున్న నమ్మకమైన వ్యక్తిగా కొంత ఆదరణ ఆశించాడు. ఏ ప్రమాదమేనా తమ వరకూవస్తే ఆ ఆదరణ అందించే తత్వం రామభద్రం లాంటివాళ్ళకి వుండదని వాడికి అర్థమైంది.

అలాగే రంగడికి తనున్న జీవితంలో మూడురకాల నేరాలు కనిపించాయి.

ఒకటి అమాయకంగా, అవసరంకోసం చేసేది.

రెండోది తప్పనిసరయ్యో.... ఆవేశపడో చేసేది, యివి రెండూ తనలాంటివాళ్ళు చేసేవి.

ఇంక మూడో రకం.... మనం నేరం చేసినా పరవాలేదు— సాధారణంగా మనని ఎవరూ ఏం చెయ్యలేరు అన్న ధీమాతో, అండ దండలతోచేసే నేరం.....ఈ మూడో రకం నేరమే ప్రకాశం చేశాడని.... దానికి అండగా రామభద్రం నిలిచాడని కూడా అర్థమైంది రంగడికి.

ఇలా యిన్నిరకాలుగా అర్థమయ్యాక తానేం చెయ్యాలో జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయించుకున్నాడు రంగడు.

న్యాయం జరగాలంటే ఏదో రకమైన బలం కావాలి రామభద్రానికి వున్నబలాలేవీ తనకి లేవని రంగడికి తెలుసు. చుట్టూవున్న పరిస్థితి అడివిలా కనపడింది రంగడికి. అందుకే తనకివున్న శరీరబలాన్నే వుపయోగించాలని నిర్ణయించుకున్నాడు రంగడు. అలా నిర్ణయించుకున్నాక మిగిలిన వ్యవ

వికృతి

"డాలీకి బిస్కెట్లు పెట్టమ్మా"
"చిన్నికి గంజి తాపమ్మా"
"డాలీ"
కలవారి కుక్కపిల్ల.
"చిన్ని"
నిరుపేద బిక్కపిల్ల.

—ఎస్. బి. ఆర్. ప్రసాద్



హారం పెద్ద కష్టం అనిపించలేదు ... తన బేచ్ వాళ్ళనే మరో ఇద్దర్ని తనకి సాయం చూసుకున్నాడు.

జైల్నించి రాగానే రంగడు రామభద్రానికి కనిపించాడు. సీత ప్రసక్తి ఎప్పుడో వస్తుంది .... అప్పుడు ఏదోరకంగా వందో రెండొందలో ఖర్చుపెట్టి రంగడ్ని మచ్చిక చేసుకోవచ్చు అనుకున్నాడు రామభద్రం. డబ్బుతో రంగడిలాంటివాడి విషయంలో ఏదేనా సాధించొచ్చన్న ధీమాతో వున్నాడు కానీ.తనకి ఆ రకం ప్రమాదం వస్తుందనుకోలేదు రామభద్రం.

రామభద్రానికి వూళ్ళో కొన్ని ఆడకాతాలున్నాయి. గోడౌన్ అనుబంధ గదుల్లోకి, కొట్టు గదులవెనక విశ్రాంతి గదులకి వాళ్ళు అప్పుడప్పుడు వస్తుంటారు. అలా వాళ్ళు వచ్చే సమాచారం రంగడు రామభద్రానికి మోసుకురావటం పరిపాటి. వాళ్ళల్లో సావిత్రంటే రామభద్రానికి మోజెక్కువ.

ఆ సావిత్రి వస్తోందని రామభద్రాన్ని ఆ యింటికి తీసుకొచ్చాడు రంగడు.అక్కడ సావిత్రి లేదు. రంగడికి సాయంగా వచ్చిన వాళ్ళున్నారు.


ఆ రాత్రి పదింటి దగ్గర్నించీ తెల్లారు ఝామున నాలిగింటివరకూ చిత్రమైన నరకం అనుభవించాడు రామభద్రం.

రామభద్రం అరిచినా ప్రమాదం లేని చోటు.... దానికితోడు ముగ్గురూ కత్తులు చూపించి అరవద్దన్నారు.

స్థూలకాయుడైన రామభద్రాన్ని ఆ యింట్లో అటూయిటూ పరిగెత్తించారు.

# జీవన గీతిక

జీవితపు ఎడారిలో
స్నేహాలు ఎండమావులు



పరిచయాలు ఇసుక తుఫానులు
అయినా లేకపోలేదు అక్కడక్కడా
ఆత్మీయతా ఒయాసిస్సులు!

—ఎస్సెస్వీరాజ్

పిల్లి మొగ్గలేయించారు .... అతని శరీరం తట్టుకోలేనన్ని గుంజీలు తీయించారు.... పూర్తిగా బట్టలిప్పి గడ్డకట్టే ఆ చలిరోజుల్లో చల్లటి మంచు తేలుతున్న నీళ్ళు నెత్తినిండా పోశారు.రామభద్రం మొఖంనిండా వుమ్మేశారు. ఇలా.... యింకా చాలా చాలా రంగడి కసి తీరేలా చేశాడు. మిగిలిన ఇద్దరితో చేయించాడు. అంతే తప్ప.... రామభద్రం శరీరంమీద ఆనమాలు తెలిసేలా ఒక్కదెబ్బేనా వెయ్యలేదు. రామభద్రాన్ని నిమిషం కూచోనివ్వలేదు.

విపరీతమైన శారీరక సౌఖ్యానికి అలవాటుపడ్డ రామభద్రానికి అది తట్టుకోలేని యాతన. చిత్రమైన నరకం....పైగా వాళ్ళు యింకేక్షణాన ఏం చేస్తారోనని భయం.

ఏడ్చాడు."ఏం కావాలంటే అది చేస్తాను. యిలా నరకయాతన పెట్టొద్దు...."అని బతిమాలాడు. తన వ్యాపార లౌక్యంతో, పలుకుబడి అండతో, సాంఘిక అనుకూలతతో ఎందర్నో ఏళ్ళతరబడి హింసించే రామభద్రం కాళ్ళ బేరానికి వచ్చేశాడు. రంగడి కాళ్ళు పట్టుకుని దేనికేనా సరే...." అన్న స్థితికి వచ్చేశాడు.

వ్యక్తిగా రంగడికి ఆ సమయంలో వున్నది పరిమితమైన బలం. ఆ బలాన్ని యెంతవరకూ వాడుకోవాలో అంతవరకూ వాడుకున్నాడు రంగడు.

అదే రాత్రి ప్రకాశంవచ్చి జరిగిందంతా వొప్పుకుని తండ్రిలాగే తన కాళ్ళట్టుకునేలా చేశాడు. డబ్బుతో నడుస్తున్న జీవితం కాబట్టి ఆ తండ్రీ కొడుకుల దగ్గర్నించి అందినంత డబ్బు వసూలుచేశాడు రంగడు.

దీనివల్ల తనబతుకు, తన చెల్లెలు బతుకు తండ్రి బతుకు ఆర్థికంగా కొంచెం మెరుగుపట్టం తప్ప గొప్పగా మారిపోదని రంగడికి తెలుసు. అయినా తృప్తిగా అనిపించింది వాడికి.

తిరిగిమళ్ళీ తను జైలుపాలైనా పరవాలేదనిపించింది.

బతకటమేతప్ప ఏ కట్టుబాటూ లేని అది విలా, అన్ని కట్టుబాట్లు వుండి నిష్ప్రయోజనంగా వున్న జీవితంలో తనుచేసిన పని సబబే అనిపించింది వాడికి.

